బిజెపిని గద్దెదించడమే మా లక్ష్యం

- 26న రాష్ట్ర వ్యాప్తంగా ట్రాక్టర్, వాహనాల ర్యాలీ
- ఫిబ్రవరి 16న గ్రామీణ బంద్, సమ్మెను జయప్రదం చేయాలి
- ఎస్‌కెఎం, కార్మిక సంఘాల జెఎసి పిలుపు

బంద్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోన్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వ తీరును ఇంటింటికీ తీసుకెళ్తామని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం), కార్మిక సంఘాల జెఎసి, వ్యవసాయ కార్మిక సంఘాలు ప్రకటించాయి. బిజెపిని గద్దెదించడమే తమ లక్ష్యమని పిలుపునిచ్చాయి. కేంద్రంలోని బిజెపి సర్కారు అమలు చేస్తున్న రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానా లను నిరసిస్తూ ఈనెల 26న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ట్రాక్టర్, వాహనాల ర్యాలీలను నిర్వహిస్తున్నట్టు వెల్లడించింది. వచ్చేనెల 16న గ్రామీణ బంద్, సమ్మెను జయప్రదం చేయాలని కోరాయి. సోమవారం హైదరాబాద్‌లోని నారాయణగూడ ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో ఎస్‌కెఎం, కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. బంద్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్‌కెఎం కన్వీనర్లు టి.సాగర్, పశ్యపద్మ, రాయల చంద్రశేఖర్, భిక్షపతి, జక్కుల వెంకటయ్య, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్ బాలమల్లేష్ మాట్లాడుతూ.. చారిత్రాత్మక రైతు ఉద్యమ సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. పంటలకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టాన్ని చేయలేదన్నారు. రుణమాఫీ చట్టం రూపొందించలేదని అన్నారు. విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించలేదని చెప్పారు. వ్యవసాయాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని విమర్శించారు. దేశంలో సహకార వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. బడ్జెట్‌లో నిధులకు కోత పెడుతున్నారనీ, ఎరువుల సబ్సిడీని తగ్గిస్తున్నారని చెప్పారు. 2013 భూసేకరణ చట్టానికి తూట్లు పొడిచిందన్నారు. విద్యార్థి, యువజన, మహిళా, సామాజిక సంఘాలు, మేధావులను ఈ ఉద్యమంలో భాగస్వాములను చేస్తామని అన్నారు. రైతు సమస్యలను పరిష్కరించకపోవడం, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోన్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. మతోన్మాదానికి అండగా ఉంటారా?, ప్రజా సమస్యల పరిష్కారానికి అండగా ఉంటారా? రాజకీయ పార్టీల నేతలు నిర్ణయం తీసుకోవాలని కోరారు. బిజెపికి వ్యతిరేకంగా సాగుతున్న ఈ పోరాటంలో రాజకీయ పార్టీలు భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు. ఈనెల 26న హైదరాబాద్‌లోని సుందరయ్య పార్క్ నుంచి ఇందిరాపార్క్ వరకు వాహనాల ర్యాలీని చేపడతామన్నారు. రైతులు, కార్మికులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలను మోడీ ప్రభుత్వం పరిష్కరించకుండా వాటిని దారి మళ్లించడంలో భాగంగానే బాల రాముడు ప్రాణప్రతిష్ట పేరుతో మభ్యపెడుతున్న దని విమర్శించారు. మతం, రాముడు, నమ్మకం, భక్తి వ్యక్తిగతమైనవని అన్నారు. బిజెపి పాలకులు మతాన్ని రాజకీయాలకు జోడించి హిందూత్వ నినాదాన్ని ముందుకు తెచ్చేందుకు కుట్ర చేస్తున్నారని చెప్పారు. తద్వారా మెజార్టీగా ఉన్న హిందువుల ఓట్లు పొందటానికి చేస్తున్న కుతంత్రం ఇది అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్‌ఎల్ పద్మ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, మహిళా విభాగం కన్వీనర్ బొప్పని పద్మ, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు కె కాంతయ్య, ఎస్‌కెఎం నాయకులు శంకర్, పల్లవి, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు ప్రభు లింగం తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బిఐ ఉద్యోగులు స్ఫూర్తిదాయకం

- గవర్నర్ తమిళిసై ప్రశంస
- సాయుధ దళాలకు భారీ సాయం

ప్రజాశక్తి - హైదరాబాద్

సాయుధ దళాల ఫ్లాగ్ డే ఫండ్‌కు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) హైదరాబాద్ సర్కిల్ ఉద్యోగులు భారీ సాయాన్ని ప్రకటించారు. రూ.34,16,750 విలువ చేసే చెక్కును తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర్యరాజన్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో సైనిక్ వెల్ఫేర్ (తెలంగాణ) డైరెక్టర్ కల్నల్ రమేష్ కుమార్, డిజిఎం అండ్ సిడిఒ జితేంద్ర కుమార్ శర్మ, సిఎస్ఒ లెఫ్టినెంట్ కాడర్ అతుల్య ఆనంద్, ఎస్‌బిఐ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ తమిళిసై మాట్లాడుతూ.. "ఎస్‌బిఐ సిబ్బంది అందించిన సహకారం ఒక ఉదాత్తమైన ఉద్దేశ్యంతో కూడింది. ఇలాంటి పనులు స్ఫూర్తినిస్తాయి. ఎస్‌బిఐ ఉద్యోగులు స్ఫూర్తిదాయకం. ఇతర సంస్థలు, పౌరులు అనుకరించాలి. యుద్ధ అనుభవజ్ఞులు, మాజీ సైనికులు, యుద్ధ వితంతువుల సంక్షేమానికి మద్దతుగా ఎస్‌బిఐ సహకారం అందించడం గొప్ప అంశం." అని అన్నారు. ఎస్‌బిఐ హైదరాబాద్ సర్కిల్ హెడ్ రాజేష్ కుమార్ మాట్లాడుతూ.."తమ సంస్థ దేశానికి తిరిగి ఇవ్వాలని విశ్వసిస్తుందన్నారు. సాయుధ దళాల కుటుంబాల పురోగతికి సహాయపడే లక్ష్యంతో హైదరాబాద్ సర్కిల్ సిబ్బంది సమిష్టిగా విరాళాలు అందించారు.

ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించాలి

- మంత్రి కొండా సురేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించాలని అటవీ దేవాదాయ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. సోమవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. కలెక్టర్ పి ప్రావీణ్య, జిడబ్ల్యుఎంసి కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాఖేడేతో కలిసి ప్రజల నుంచి వివిధ సమస్యలపై 55 వినతులు స్వీకరించారు. వీటిని పరిశీలించి త్వరగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు.

గురుకుల పాఠశాల విద్యార్థిని మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గురుకుల పాఠశాలలో ప్రార్థన సమయంలో ఓ విద్యార్థిని కండ్లు తిరిగి కింద పడిపోయి మృతి చెందారు. ఈ ఘటన సోమవారం నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి పట్టణంలో జరిగింది. ఎస్ఐ వీరబాబు, పాఠశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. పిఎపల్లి మండలం, అంగడిపేట గ్రామానికి చెందిన దాసరి ఆంజనేయులు- అండాలు కూతురు దాసరి భార్గవి (14) స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నారు. భార్గవి ఉదయం పాఠశాలలో ప్రార్థన చేస్తున్న సమయంలో కండ్లు తిరిగి కింద పడిపోయారు. ఉపాధ్యాయులు వెంటనే విద్యార్థిని పట్టణంలోని మెడికేర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరిశీలించిన వైద్యులు బాలిక పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతిచెందినట్టు చెప్పారు. దీంతో ఆగ్రహించిన బాలిక కుటుంబ సభ్యులు, బంధువులు స్థానిక రహదారిపై గంటకు పైగా రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ సంఘటనా స్థలానికి వచ్చి విద్యార్థిని తల్లిదండ్రులను ఓదార్చారు. పాఠశాల విద్యార్థిని మృతి చెందడం ఎంతో బాధాకరమని, కుటుంబ సభ్యులు అధైర్య పడొద్దని చెప్పారు. విద్యార్థిని కుటుంబంలో ఒకరికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థిని మృతి పట్ల విచారణ జరిపిస్తామన్నారు. అదేవిధంగా గురుకుల విద్యాలయాల తరపున బాలిక తల్లిదండ్రులకు 50 వేల రూపాయలు అందజేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వారికి అప్పగించారు. బాలిక తండ్రి దాసరి ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వీరబాబు తెలిపారు. విద్యార్థిని మృతిపై అనుమానాలున్నాయంటూ విద్యార్థి సంఘాల నాయకులు నిరసన తెలిపారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి తల్లిదండ్రులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

మెట్రో ఫేజ్2 విస్తరణకు రూట్ మ్యాప్ ఖరారు

- 70 కి.మీ మేర కొత్త మార్గం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 విస్తరణకు రూట్ మ్యాప్ ఖరారైంది. సిఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో అధికారులు రూట్ మ్యాప్‌ను సిద్ధం చేశారు. దీనిలో భాగంగా 70 కిలోమీటర్ల మేర కొత్త మెట్రో మార్గాన్ని నిర్మించేలా ప్రతిపాదనలు సిద్ధం చేసిన అధికారులు.. వివరాలను సిఎంకు అందించారు. విస్తరణలో భాగంగా జెబిఎస్ నుంచి ఎంజిబిఎస్ మీదుగా చాంద్రాయణగుట్ట క్రాస్‌రోడ్డు వరకు మెట్రో మార్గాన్ని పొడిగించనున్నారు. కొత్తగా మరో నాలుగు కారిడార్లలో నిర్మాణం చేపట్టనున్నారు.

ప్రతిపాదించిన మెట్రో మార్గాలివే..

కారిడార్ 2 : ఎంజిబిఎస్ మెట్రో స్టేషన్ నుంచి ఫలక్‌నుమా వరకు - (5.5 కి.మీ)
కారిడార్ 2 : ఫలక్‌నుమా నుంచి చాంద్రాయణగుట్ట క్రాస్‌రోడ్డు వరకు-(1.5కి.మీ)
కారిడార్ 4 : నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు(నాగోల్-ఎల్బీనగర్-చాంద్రాయణగుట్ట-మైలార్‌దేవ్‌పల్లి నుంచి ఎయిర్‌పోర్టు వరకు) - (29కి.మీ)
కారిడార్ 4 : మైలార్‌దేవ్‌పల్లి నుంచి ప్రతిపాదించిన హైకోర్టు వరకు - (4 కి.మీ)
కారిడార్ 5 : రాయదుర్గం నుంచి అమెరికన్ కాన్సులేట్ వరకు (రాయదుర్గం-నానక్‌రామ్‌గూడ-విప్రో జంక్షన్ నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు) - (8 కి.మీ)
కారిడార్ 6 : మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు (మియాపూర్-పటాన్‌చెరు-బిహెచ్ఇఎల్-పటాన్‌చెరు) - (14 కి.మీ)
కారిడార్ 7 : ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ (ఎల్బీనగర్-వనస్థలిపురం-హయత్‌నగర్) వరకు - (8కి.మీ)

హైకోర్టుకు యూనివర్సిటీ భూములివ్వడం అన్యాయం

- ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర హైకోర్టు భవన నిర్మాణానికి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ భూములు వంద ఎకరాలు కేటాయించడం అన్యాయమని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ అన్నారు. అగ్రికల్చర్ యూనివర్సిటీ విద్యార్థుల నిరసనకు సోమవారం ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ తరపున మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీని సంప్రదించకుండా ఉద్యానవన యూనివర్సిటీకి చెందిన 43.6 ఎకరాలు, వ్యవసాయ యూనివర్సిటీ భూములు 57.4 ఎకరాలను హైకోర్టు నిర్మాణానికి కేటాయించడం సరికాదన్నారు. తొందరపాటుతో జిఓ 55 తీసుకొచ్చార న్నారు. దీని వల్ల యూనివర్సిటీలో ఉన్న 400 రకాల వృక్ష జాతులు, 80 రకాల పక్షి జాతులు, 350 అరుదైన జాతులు అంతరించి, జీవవైవిధ్యం నష్టపోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్ పరిశోధనలకు, జీవ వైవిధ్యానికి నష్టం చేసే చర్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నూతన విత్తన అభివృద్ధి, వంగడాల అభివృద్ధి, వ్యవసాయంలో నూతన సంస్కరణల అమలుకు వేలాది ఎకరాల భూమి అవసరం అన్నారు. ఈ భూములను యూనివర్సిటీకే ఉంచి, హైకోర్టుకు వేరే ప్రాంతంలో భూములు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు మద్దతుగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బి.శంకర్, జిల్లా నాయకులు ఎం స్టాలిన్, వేణు ప్రకాశ్, యూనివర్సిటీ విద్యార్థి నాయకులు రాజ్‌కుమార్, శ్రీజ, శంకర్, వంశీ, అరవింద్, మధుకర్, శివజ్యోతి, నవీన్, విక్రమ్‌రెడ్డి, భానుచందర్, సుభాష్, అజయ్, సురేందర్, తేజ తదితరులు పాల్గొన్నారు.

జిఓ 142ను రద్దు చేయాలి

- కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మానవ వనరుల హేతబద్ధీకరణ కోసమంటూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన జిఓ 142 లోపభూయిష్టంగా ఉందని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ విమర్శించింది. ఈ జిఒను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ నెహ్రూ చంద్ నాయక్ ఒక ప్రకటన విడుదల చేశారు. క్షేత్రస్థాయి నుంచి సమాచారం తీసుకోకుండా ఏకపక్షంగా విడుదల చేసిన ఈ జిఒ ప్రజారోగ్యరంగానికి గొడ్డలిపెట్టు లాంటిందని తెలిపారు. టీబీ శానిటోరియం, రాష్ట్ర స్థాయి శిక్షణా కేంద్రాల ఎత్తివేత, కొన్ని పోస్టుల రద్దు నిర్ణయాలు సహేతుకంగా లేవని పేర్కొన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లమా ఇన్ హెల్త్ ఎడ్యుకేషన్ చేసిన హెల్త్ ఎడ్యుకేటర్లను పరిగణలోకి తీసుకోకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. 123 ఇన్‌స్టిట్యూట్‌లను రద్దు చేస్తే 4,318 ఉద్యోగాలను కోల్పోతామని ఆందోళన వ్యక్తం చేశారు. జిఓ రద్దు కాకుండా అమలు చేసేందుకు కొంత మంది ఉన్నతాధికారులు అత్యుత్సాహంతో దొడ్డిదారిన ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ జోక్యం చేసుకుని ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.

పూలె జ్యోతి విగ్రహం ఏర్పాటు కు అభ్యంతర మే ఏమిటి?

- కాంగ్రెస్‌ను ప్రశ్నించిన ఎమ్మెల్సీ కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిరావు పూలె విగ్రహం ఏర్పాటు చేయాలని రాజకీయాలకు అతీతంగా కోరుతుంటే కాంగ్రెస్ నాయకులు రాజకీయాలు అంటగట్టడం సరికాదని ఎమ్మెల్సీ కవిత అన్నారు. భారత జాగృతి సంస్థ కోరడమే మీకు అభ్యంతరమా? లేక అసెంబ్లీలో పూలె విగ్రహం ఏర్పాటు చేయడమే మీకు అభ్యంతరమా? అని సూటిగా ప్రశ్నించారు. స్ఫూర్తిదాయక వీరులకు మీరు ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే జాగృతి సంస్థ ద్వారా పోరాటం చేసి అసెంబ్లీ ఆవరణలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయించామన్నారు. ఇప్పుడూ అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహ ఏర్పాటు కోసం రాజకీయాలకు అతీతంగా మరో పోరాటాన్ని సాగిస్తామన్నారు.రాజకీయాల కోసం, సంకుచిత మనస్తత్వంతో ఈ మహా కార్యాన్ని అవహేళన చేయరని ఆశిస్తున్నట్లు చెప్పారు. మహాత్మా జ్యోతిరావు పూలే మహోన్నతుడు, అణగారిన ప్రజల్లో చైతన్యం నింపిన మహా మనిషి. అందుకే ఏప్రిల్ 11 నాటికి పూలె విగ్రహాన్ని తెలంగాణ శాసనసభ ప్రాంగణంలో ఏర్పాటు చేయాలని భారత జాగృతి తరుపునే కాకుండా యావత్ తెలంగాణ ప్రజల తరుపున వినమ్రంగా మరోసారి కోరుతున్నానని కవిత తెలిపారు.

29 నుంచి అయోధ్యకు ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అయోధ్యలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ట పూర్తయిన నేపథ్యంలో నేటి నుంచి సామాన్య ప్రజలకు బాల రాముడి దర్శనం కల్పించనున్నారు. ఈ నేపథ్యంలో జనవరి 29 నుంచి బిజెపి ఆధ్వర్యంలో ప్రత్యేక రైళ్లు నడపనున్నారు. తెలంగాణలోని ఒక్కో అసెంబ్లీ నియోజక వర్గం నుంచి 200 మంది అయోధ్య యాత్ర చేసేందుకు అవకాశం కల్పించనున్నారు. ఈ ప్రత్యేక రైళ్లలో 20 బోగీలుంటాయి..ఒక్కోరైలులో 1,400మంది ప్రయాణించవచ్చు. అయోధ్యకి వెళ్లి రావడానికి ఐదు రోజుల సమయం పడుతుంది. సికింద్రాబాద్, కాజీపేట రైల్వే స్టేషన్ల నుంచి ఈ రైళ్లు బయలుదేరనున్నాయి. సికింద్రాబాద్, నిజామాబాద్, జహీరాబాద్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, మల్కాజిగిరి, మెదక్ పార్లమెంట్ నియోజకవర్గాలకు చెందిన భక్తులు సికింద్రాబాద్‌లో రైలు ఎక్కాల్సి ఉంటుంది. నల్గొండ, వరంగల్, మహబూ బాబాద్, ఖమ్మం, పెద్దపల్లి, కరీంనగర్, నియోజకవరా ్గలకు చెందిన వారు కాజీపేటలో రైలు ఎక్కాల్సి ఉంటుంది.

ఏ నియోజకవర్గంలో ఎక్కడి నుంచి రైలు అందుబాటులో ఉంటుందనే విషయాలను బిజెపి సోమవారం వెల్లడించింది. సికింద్రాబాద్ - జనవరి 29, వరంగల్ - జనవరి 30, హైదరాబాద్ - జనవరి 31, కరీంనగర్ - ఫిబ్రవరి 1, మల్కాజిగిరి - ఫిబ్రవరి 2, ఖమ్మం - ఫిబ్రవరి 3, చేవెళ్ల - ఫిబ్రవరి 5, పెద్దపల్లి - ఫిబ్రవరి 6,నిజామాబాద్ - ఫిబ్రవరి 7, ఆదిలాబాద్ - ఫిబ్రవరి 8, మహబూబ్‌నగర్ - ఫిబ్రవరి 9,మహబూబాబాద్ - ఫిబ్రవరి 10, మెదక్ - ఫిబ్రవరి 11,భువనగిరి - ఫిబ్రవరి 12,నాగర్ కర్నూల్ - ఫిబ్రవరి 13,నల్గొండ - ఫిబ్రవరి 14, జహీరాబాద్ - ఫిబ్రవరి 15 తేదీల్లో రైళ్లు అందుబాటులో ఉంటాయి.

మళ్లీ తెరపైకి విఆర్ఓ, విఆర్ఎ వ్యవస్థలు ?

- ధరణి స్థానంలో భూమాత పోర్టల్
- బడ్జెట్ సమావేశాల్లో రెవెన్యూ పునరుద్ధరణ బిల్లు!
- కసరత్తు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో మళ్లీ విఆర్ఓ, విఆర్ఎ వ్యవస్థలు జీవం పోసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం భారీ కసరత్తు చేస్తోంది. ప్రభుత్వానికి, గ్రామాలకు మధ్య వారధిగా పనిచేస్తూ వచ్చిన గ్రామ రెవెన్యూ వ్యవస్థ మళ్లీ పునరుద్ధరించడం తప్ప మరో మార్గం లేదనే ఆలోచనలోనున్నట్టు సమాచారం. గత సర్కార్ తీసుకొచ్చిన ధరణిలో మార్పులు చేసి భూమాత పోర్టల్‌ను అందుబాటులోకి తేనున్నారు. త్వరలో వీటికి సంబంధించి విధాన పరమైన నిర్ణయం వెలువడే అవకాశముంది.

గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థను గతంలో కంటే మరింత పటిష్టంగా తయారు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం తీసుకొనున్నది. ఈ మేరకు రానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో గ్రామ రెవెన్యూ వ్యవస్థ పునరుద్ధరణ బిల్లును ప్రవేశపెట్టే అవకాశాలున్నాయని తెలుస్తోంది. ఇందుకు సంబంధించి సర్కార్ త్వరలో విధాన పరమైన నిర్ణయం తీసుకోనుంది. గ్రామాల్లో తిష్టవేసిన ఎన్నో సమస్యలు ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. భూ సమస్యల పరిష్కారాలు, ప్రకృతి వైపరీత్యాలు, ధాన్యం కొనుగోళ్లు, సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక, ఎన్నికల విధులు, ప్రభుత్వ భూముల పరిరక్షణ, కుల, ఇన్‌కం, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు మొదలగు దాదాపు 20కి పైగా సమస్యలు, విఆర్వో బాధ్యతలకు సంబంధించినవే కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి ఎన్నో సమస్యలు వచ్చాయని, వాటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని రెవెన్యూ వ్యవస్థ పునరుద్ధరణ జరిగి తీరాలని ఆయన చాలా పట్టుదలగా ఉన్నట్టు సమాచారం.

మార్పులు, చేర్పులపై కసరత్తు

గతంలో ఉన్న గ్రామ రెవెన్యూ ఆఫీసర్ (విఆర్ఒ), విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ (విఆర్ఎ) పోస్టులను యథావిధిగా ప్రవేశపెడతారా? లేక రెండు రకాల పోస్టులను కలిపి ఒకే పోస్టుగా సర్దుబాటు చేసి విలేజ్ రెవెన్యూ సెక్రటరీ (విఆర్ఎస్) అనే పోస్టును సృష్టించి నియామకాలు చేస్తారా? అనే అంశాలపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ముఖ్యమంత్రి స్థాయిలో సమీక్ష తర్వాత విధానపరమైన తుది నిర్ణయం తీసుకోనున్నారు. ప్రభుత్వానికి, గ్రామాలకు మధ్య వారధిగా ఉన్న ఈ వ్యవస్థ లేక పోవడం వల్ల సర్కారుకు, ప్రజలకు మధ్య క్రమంగా దూరం పెరుగుతూ వస్తోంది. ఈనేపథ్యంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం పాత రెవెన్యూ వ్యవస్థవైపు అడుగులు వేస్తోందని సమాచారం.

"భూమాత"గా ధరణి

గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ధరణి పోర్టల్ భూమాతగా మారనుంది. ఈ పోర్టల్‌లో ఉన్న లొసుగులను సరిదిద్దేందుకు సిసిఎల్ఎ కమిషనర్ కన్వీనర్‌గా పలువురు భూ నిపుణులతో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ధరణి కమిటీని ఏర్పాటు చేసింది. మూడు దఫాలు సమావేశమైన ఈ కమిటీ ఇప్పటికే ఆ పోర్టల్‌లో ఉన్న అనేక లొసుగుల పరిష్కారంపై ఓ నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో ఇందులో మార్పులు చేసి ధరణి స్థానంలో భూమాతను తీసుకురానున్నారు. పాత రెవెన్యూ వ్యవస్థ పునరుద్ధరణతో పాటు దీనిని కూడా అందుబాటులోకి తేనున్నట్టు తెలుస్తోంది.

హైదరాబాద్‌కు చేరుకున్న సిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విదేశీ పర్యటన ముగించుకొని హైదరాబాద్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శంషాబాద్ ఎయిర్ పోర్టులో ప్రభుత్వ ప్రోటోకాల్ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి దావోస్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌లో పాల్గొని రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించేందుకు కృషి చేశారని వేణుగోపాల్ అభినందించారు. లండన్, దుబాయ్ దేశాల పర్యటనలు విజయవంతంగా ముగించుకుని రాష్ట్రానికి రావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

సిఎంకు స్వాగతం పలుకుతున్న వేణుగోపాల్

తమ్మినేనికి అద్దంకి దయాకర్ పరామర్శ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను టిపిసిసి అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ సోమవారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఎఐజి అస్పత్రి వైద్యులను అడిగి మరిన్ని వివరాలు తెలుసుకున్నారు. తమ్మినేని త్వరగా కోలుకుని ప్రజాక్షేత్రంలోకి తిరిగి రావాలని దయాకర్ ఆకాంక్షించారు. గుండె, కిడ్నీ, ఊపిరితిత్తుల సంబంధిత సమస్యతో బాధపడుతున్న తమ్మినేనిని ఈనెల 16న హైదరాబాద్‌లోని ఎఐజి ఆస్పత్రిలో చేర్పించిన విషయం తెలిసిందే.

అస్సాం ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలి

- మంత్రి శ్రీధర్‌బాబు
- కొవ్వొత్తులతో కాంగ్రెస్ నిరసన ర్యాలీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ యాత్రపై అస్సాం రాష్ట్రంలోని సోనిత్‌పూర్ జిల్లాలో బిజెపి దాడిపై ఆ రాష్ట్ర ప్రభుత్వం తక్షణం క్షమాపణ చెప్పాలని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. దాడిని ఖండిస్తూ ఎఐసిసి పిలుపు మేరకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ శ్రేణులు మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపా దాస్ మున్షి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అస్సాం ప్రభుత్వం రాహుల్ గాంధీకి భద్రత కల్పించడంలో పూర్తిగా విఫలమైందని, కాంగ్రెస్‌కు, రాహుల్ గాంధీకి ఆ రాష్ట్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీకి వస్తున్న ఆదరణను చూసి తట్టుకోలేక బిజెపి శ్రేణులు దాడులకు పాల్పడుతున్నాయని విమర్శించారు. బిజెపి శ్రేణుల మాదిరిగా కాంగ్రెస్ పార్టీకి దేశవ్యాప్తంగా కార్యకర్తలు, అభిమానులు ఉన్నారని, వారు ప్రజాస్వామ్యాన్ని రక్షించడంలో ఉన్నారన్నారు. అస్సోంలో బిజెపి కార్యకర్తలు గుండాలుగా ప్రవర్తించారన్నారు. కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి మాట్లాడుతూ.. అస్సోం రాష్ట్రంలో రాహుల్ గాంధీ, కాంగ్రెస్ కార్యకర్తలపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. హిమంత బిస్వా శర్మ కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడే మంచి నాయకుడిగా ఉండేవాడని, బిజెపిలోకి వెళ్లిన తర్వాత దారుణంగా తయారయ్యారని విమర్శించారు. అక్కడి జనాలు హిమంత బిస్వా శర్మను అసహ్యించుకుంటున్నారన్నారు. ఎమ్మెల్సీలు బలుమూరు వెంకట్, మహేష్ కుమార్ గౌడ్, మాజీ కేంద్ర మంత్రి బలరాం నాయక్, మాజీ ఎంపీలు అంజన్ కుమార్ యాదవ్, మధుయాష్కీ గౌడ్, మాజీ మంత్రి పుష్పలీల, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్పు వస్తుందనే భయంతోనే : జగ్గారెడ్డి

భారత్ జోడో న్యాయ్ యాత్రతో దేశంలో మార్పు వస్తుందనే భయంతోనే బిజెపి గుండాలు రాహుల్ గాంధీపై దాడి చేశారని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి విమర్శించారు. అస్సోంలో బిజెపి గుండాలు అడ్డుకుని దాడికి ప్రయత్నించడాన్ని నిరసిస్తూ ఎఐసిసి ఇచ్చిన పిలుపులో భాగంగా టిపిసిసి ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ బాబు జగ్జీవన్‌రాం విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. జగ్గారెడ్డి మాట్లాడుతూ.. దేశంలో నెలకొన్న విపరిణామాలపై న్యాయం కోసం రాహుల్ యాత్ర చేస్తుంటే బిజెపి నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేయడం సిగ్గుచేటన్నారు. ఇటీవల దేశంలో హింస పెరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో రెండు తెగల మధ్య జరిగిన హింసాత్మక ఘటనలపై బిజెపిని రాహుల్ గాంధీ ప్రశ్నించారనీ, మోడీ వైఫల్యాలపై నిలదీశారని తెలిపారు.

ఈ నెలా పాత పింఛన్లు

కాంగ్రెస్ గ్యారెంటీల అమలుకు మరింత సమయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చి నెలన్నర గడుస్తున్నా ఎన్నికల గ్యారెంటీల అమలుపై ప్రజలకు స్పష్టత రావడంలేదు. గృహజ్యోతి, పింఛన్ల పెంపు, రూ.500లకే గ్యాస్ సిలిండర్, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు వంటి పథకాల కోసం మరింత సమయం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. గ్యారంటీలను అమలు చేయడానికి దరఖాస్తులు తీసుకున్నప్పటికీ.. విధివిధానాలను ఇంకా ఖరారుచేయ లేదు. అసలు ఆ పథకాలను ఎప్పుడు అమలుచేస్తారా అని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. ఈక్రమంలో ఆసరా పింఛన్ల పెంపుపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో పాత పద్ధతిలోనే విడుదల చేసేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఒకట్రెండు రోజుల్లో లబ్ధిదారుల ఖాతాల్లో సొమ్ము జమ చేయనున్నారు. ప్రస్తుతం సాధారణ పెన్షన్ రూ.2,016, దివ్యాంగ పింఛను రూ.3,016 వస్తున్నది. అయితే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సాధారణ పింఛను ను రూ.4 వేలు, దివ్యాంగులకు ఇచ్చే పెన్షన్‌ను రూ.6 వేలు చేస్తామని ప్రకటించారు. ఆ హామీ ఎప్పటి నుంచి నెరవేరుతుందనే స్పష్టత లేకపోవడంతో పాత తరహాలోనే పింఛన్లను విడుదల చేయనున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 15,98,729 మంది వృద్ధులు, 15,60,707 మంది వితంతువులు, 5,03,613 మంది దివ్యాంగులు, బీడీ కార్మికులు 4,24,585 మంది, ఒంటరి మహిళలు 1,42,394, గీత కార్మికులు 65,307, చేనేత కార్మికులు 37,145, హెచ్ఐవీ బాధితులు 35,998.. ఇలా వివిధ వర్గాలవారు మొత్తం 43,96,667 మంది పింఛన్లు పొందుతున్నారు. వీరికోసం ప్రతినెలా రూ.వెయ్యి కోట్లు ఖర్చవుతోంది. ఇక, రైతుబంధు విషయంలో కూడా ప్రభుత్వం ఇదేవిధంగా వ్యవహరిస్తున్నది. ఎన్నికల నాటికే పంటసాయం పెట్టుబడి డబ్బు సమకూరినప్పటికీ.. పూర్తిస్థాయిలో రైతులకు ఆ మెత్తం అందలేదు.

NOTICE

IN THE COURT OF THE V Addl . DISTRICT JUDGE, GUNTUR

M.V.O.P No. 284 / 2019

Between :
Namala Nagarjuna ....Petitioner
and
Aella Mallikarjuna Reddy&Others ...Respondents
To,
R-1: Aella Mallikarjuna Reddy, S/o.Jaya Rami Reddy, Lorry Owner, R/o. Flat No.26, Mallikharjuna Nagar, Baiaramalguda, L.B. Nagar, Hyderabad, City Civil Courts, Hyderabad.
[Owner of Lorry No.TS06 UA 7159]
R-3: Bolimoni Ramesh, S/o.Chandraiah, Lorry Driver, R/o.Ramadugyala(V),Irvin Panchayat, Madugula (Md),Mahaboob Nagar Dt. Telangana State, District Court, Mahaboob Nagar.
[Driver of Lorry No.TS06 UA 7159]

పైనెంబరు ఓ.పి.లోని పిటీషనరు యాక్సిడెంట్‌కు నష్ట పరిహారము కోరుచూ పిటీషన్ దాఖలు చేయగా సదరు పిటీషన్ లో 1 & 3 రెస్పాండెంట్స్ అయిన మీకు నోటీసు నిమిత్తం పేపరు పబ్లికేషన్‌ద్వారా తెలియజేయమని కోర్టువారు ఉత్తర్వులు ఇచ్చి యున్నారు. కావున మీరు **ది.07-02-2024**న **ఉ॥గం॥10-30ని॥**లకు పైకోర్టు వారి ఎదుట హాజరై మీకుగల ఆక్షేపణలు తెలుపుకొనవలసినది లేని యెడల మీపరోక్షమున తీర్మానించ బడును.

వై.వి. భాస్కర రావు, పిటీషనర్ల తరపు అడ్వకేట్
గుంటూరు. సెల్: 9848245636

గ్యారంటీలకు రేషన్‌కార్డు ప్రామాణికమా?

- అర్హత ఉండీ.. కార్డు లేని కుటుంబాల్లో ఆందోళన
- ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేసుకున్న 'ప్రజాపాలన' దరఖాస్తులు
- లెక్కతేలిన అర్జీదారుల వివరాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ సర్కారు ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై కసరత్తు తొలి రోజుల్లోనే ప్రారంభించింది. ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని అమలు చేసిన సర్కారు.. మిగిలిన ఐదు గ్యారంటీల అమలు కోసం ప్రజలు నుంచి ప్రజాపాలన సభల ద్వారా తీసుకున్న దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేసింది. ఈ నేపథ్యంలో ఆయా స్కీములకు లబ్ధిదారుల ఎంపిక విషయంలో తెల్లరేషన్‌కార్డుయే ప్రామాణికంగా కనిపిస్తుండగా.. అర్హత ఉండీ కార్డు లేని కుటుంబాల్లో ఆందోళన మొదలైంది. రూ.2500 మహాలక్ష్మి, 200యూనిట్లలోపు వినియోగించే వారికి ఫ్రీ కరెంటు, రైతుభరోసా కింద రైతులు, కౌలుదారులు, రూ.500వంటగ్యాస్, గృహలక్ష్మి వంటి స్కీముల కోసం లక్షల్లో అర్జీలు ఇచ్చిన వారిలో గ్యారెంటీ.. మాటేంటి? అనే చర్చ సాగుతోంది.

సాధారణంగా ఏ ప్రభుత్వ పథకం అమలుకైనా లబ్ధిదారుల ఎంపిక కోసం రేషన్‌కార్డునే ప్రామాణికంగా తీసుకుంటారు. గడిచిన ఇన్నేండ్లలో ఆ కార్డు ప్రామాణికంగానే ప్రభుత్వ సేవలు అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,25,84,383 దరఖాస్తులొచ్చాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 8.20లక్షల రేషన్‌కార్డులు ఉండగా.. కొత్తగా జిల్లాకు 30వేల చొప్పున మరో 1.20లక్షల అర్జీలు రేషన్‌కార్డు కావాలని దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో తక్షణమే అమలయ్యే విధంగా కనిపిస్తున్న 200 యూనిట్ల ఫ్రీ కరెంటు,



మహిళలకు ప్రతినెలా రూ.2500, రూ.500కు వంటగ్యాస్ సిలిండర్‌పైనే ఆశలు పెట్టుకున్నారు. ఈ స్కీములకు సంబంధిత అధికారులు ఏయే పత్రాలు అడుగుతారోనన్న చర్చ జనంలో ఉంది. ఇప్పటికే రేషన్‌కార్డులు ఉన్నవారు, లేని వారంతా కొత్తగా కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాల దరఖాస్తు కోసం మీ-సేవ సెంటర్లకు పరుగులు తీస్తున్నారు. వంటగ్యాస్ సిలిండర్ కనెక్షన్‌పై కేవైసీ చేయించుకునేందుకు ఏజెన్సీల ఎదుటబారులు తీరుతున్నారు. ఇంకోవైపు చాలామందికి రైతు భరోసా అందలేదు. ఈ యాసంగికి పాత సాయాన్నే అందిస్తామని చెప్పిన సర్కారు సీజన్ ముగిసినా ఇప్పటివరకు కేవలం 2.5 ఎకరాల్లోపు రైతుల ఖాతాల్లోనే జమ చేసింది. వచ్చే సీజన్‌లో ఇవ్వబోయే రూ.15 వేల కోసం ఎలాంటి నిబంధనలు ఉంటాయో తెలియాల్సి ఉంది. నిబంధనలు ఉంటాయని ప్రభుత్వం లీక్‌లు ఇచ్చిన విషయం తెలిసిందే. కౌలుదారుల గుర్తింపు విషయంలో క్లారిటీ రావాల్సి ఉంది. ప్రజాపాలన దరఖాస్తుల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతుభరోసా కింద సాధారణ రైతులు 3,08,835 మంది, 4,01,624కౌలుదారులు పెట్టుబడి సాయం కోసం దరఖాస్తు చేసుకున్నారు.

'గృహజ్యోతి'కి అర్హులు ఎందరో..?

200 యూనిట్ల ఫ్రీ కరెంటు అమలుపై సిఎం రేవంత్‌రెడ్డి సమీక్ష తరువాత సంబంధిత విద్యుత్ అధికారులు లెక్కలు తేల్చే పనిలో పడగా.. జనవరి కరెంటు బిల్లులు చెల్లించొద్దంటూ బిఆర్‌ఎస్ ప్రకటనలు చేస్తోంది. ఈ క్రమంలో కరీంనగర్ జిల్లా వరకు పరిశీలిస్తే.. 200యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే సర్వీసులు 2లక్షల వరకు ఉంటాయని అధికారులు లెక్కలు తేల్చగా.. ప్రజాపాలన దరఖాస్తుల్లో 235091 మంది అప్లరు చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 8,09,496 అర్జీలు రాగా, ఇందులో పెద్దపల్లి జిల్లాలో 1,76,410, జగిత్యాల జిల్లాలో 2,55,031, సిరిసిల్ల జిల్లాలో 1,42,964 వచ్చాయి.

వంటగ్యాస్, రూ.2500 సాయం కోసం ఎదురుచూపు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొత్తం 8.93లక్షల ఎల్‌పిజి కనెక్షన్లు ఉన్నాయి. జిల్లాల వారీగా చూస్తే కరీంనగర్‌లో 2.89లక్షలు, జగిత్యాలలో 2.54లక్షలు, పెద్దపల్లిలో 2.10లక్షలు, సిరిసిల్లలో 1.40లక్షలు ఉండగా.. ఇటీవల ప్రజాపాలన సభల్లో రూ.500కు వంటగ్యాస్ సిలిండర్లు కావాలని 9,33,997 దరఖాస్తులు రావడం గమనార్హం. వీరంతా ఆయా ఏజెన్సీల్లో కేవైసి చేసుకునేందుకు బారులు తీరుతున్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 8.15లక్షల దరఖాస్తులు రాగా, కులం, ఆదాయం ధ్రువీకరణ పత్రాల కోసం మీ-సేవ సెంటర్లకు పరుగులు తీస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మహాలక్ష్మీ, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇల్లు, యువ వికాసం, చేయూత, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాలను దశల వారీగా అమలు చేస్తామని చెబుతోంది. అయితే ప్రధానంగా రేషన్‌కార్డు లేని వారు తమ పేర్లు ఆయా పథకాల జాబితాలో ఉంటాయో? లేదా అని చర్చించుకుంటున్నారు. అయితే 'కొత్త రేషన్ కార్డులు ఇచ్చాకే లబ్ధిదారుల ఎంపిక జరిగే అవకాశం ఉంది' అని రెవెన్యూ అధికారులు చెబుతుండటం కొసమెరుపు.

దిల్‌సుఖ్‌నగర్ బస్ డిపోలో అగ్ని ప్రమాదం

రెండు బస్సులు దగ్ధం..!

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్ ఆర్‌టిసి డిపోలో సోమవారం ఆగి ఉన్న బస్సులో మంటలు చెలరేగి మరో బస్సుకు వ్యాపించాయి. ఈ ఘటనలో రెండు బస్సులు దగ్ధమయ్యాయి. డిపోలో తెల్లవారుజామున ఆగి ఉన్న బస్సులో ఒక్కసారిగా పొగలు వచ్చాయి. గమనించిన సిబ్బంది వెంటనే అధికారులకు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. అయితే ఫైర్ సిబ్బంది వచ్చేలోపే మంటలు లేచి ఇంకో బస్సుకూ అంటుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను ఆర్పారు. మిగతా బస్సులకు మంటలు వ్యాప్తి చెందకుండా అదుపులోకి తీసుకొచ్చారు. డిపో మేనేజర్ హరి మలక్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగినట్టు భావిస్తున్నారు.

ఫిబ్రవరి 16న జిహెచ్‌ఎంసి కార్మికుల సమ్మె

- జెఎసి పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వేతనాల పెంపు, పర్మినెంట్ కోసం, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తోన్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఫిబ్రవరి 16న కార్మికులంతా సమ్మెలోకి వెళ్లాలని జిహెచ్‌ఎంసి కార్మిక, ఉద్యోగ సంఘాల జెఎసి పిలుపునిచ్చింది. సమ్మె సన్నాహకంలో భాగంగా ఈ నెల 26 మధ్యాహ్నం 12 గంటలకు హైదరాబాద్‌లో వాహనాలతో నిరసన ర్యాలీ తీయాలనీ, ఫిబ్రవరి ఆరు మధ్యాహ్నం రెండు గంటలకు జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయం వద్ద సదస్సు నిర్వహించాలని నిర్ణయించింది. ఫిబ్రవరి 7 నుంచి 14 వరకు సర్కిల్, జోన్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టాలనీ, ఫిబ్రవరి 16 సమ్మె విజయవంతం చేయాలని తీర్మానించింది. సోమవారం హైదరాబాద్‌లోని జిహెచ్‌ఎంసి కార్యాలయంలో హెచ్‌ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెబ్బారామారావు అధ్యక్షతన జెఎసి సమావేశం జరిగింది. అందులో మున్సిపల్ ఉద్యోగ, కార్మిక సంఘాల జెఎసి చైర్మెన్ సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, సిఐటియు యూనియన్ నాయకులు జె. వెంకటేష్, పి. సుధాకర్, శ్రావణ్‌కుమార్, మల్లేష్, యాదమ్మ, మంగపతి, అంజయ్య, టైటియుసి నాయకులు మద్దిలేటి, హెచ్‌ఎంఎస్ యూనియన్ నాయకులు అంజాద్, భిక్షపతి, బిఆర్‌టియు యూనియన్ నాయకులు కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిహెచ్‌ఎంసి కమిషనర్‌కు జెఎసి బృందం సమ్మె నోటీసు అందజేసింది. కార్మిక చట్టాలను అమలు చేయాలనీ, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేసింది. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి కార్మికులను పర్మినెంట్ చేయాలనీ, పిఎఫ్, ఇఎస్‌ఐని ఖచ్చితంగా అమలు చేయాలని కోరింది. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలనీ, కేటగిరీల వారీగా వేతనాలివ్వాలని డిమాండ్ చేసింది. ఆరు గ్యారంటీల్లో మున్సిపల్ కార్మికులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. వయస్సు మీరిన, చనిపోయిన కార్మికుల కుటుంబాలలో ఒకరికి ఎలాంటి జాప్యం లేకుండా ఉద్యోగం ఇవ్వాలనీ, బయో మెట్రిక్ హాజరు పట్టీలో జరుగుతున్న అవకతవకలను అరికట్టాలని డిమాండ్ చేసింది. హైకోర్టు తీర్పు ప్రకారం జిహెచ్‌ఎంసి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలనీ, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి-సమాన వేతనం ఇవ్వాలని కోరింది. పారిశుద్ధ్య సేవల్లో ప్రయివేటు చర్యలను ఉపసంహరించాలనీ, రాంకీ తదితర ప్రయివేటు ఇంజినీరింగ్ కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేసింది.

జాతి గర్వించదగ్గ రీతిలో రామ మందిర నిర్మాణం

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జాతి గర్వించదగ్గ రీతిలో రామ మందిర నిర్మాణం జరిగిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. అయోధ్యలో శ్రీరామ ప్రాణ ప్రతిష్ట ఉత్సవ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి హాజరైన కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. అయోధ్యలో శ్రీరామ ప్రాణ ప్రతిష్ట ఉత్సవాన్ని ప్రపంచంలో 150 దేశాల ప్రజలు వీక్షించారని తెలిపారు. అయోధ్య రామ మందిర ఉద్యమంలో జి. పుల్లారెడ్డి సేవలను స్మరించుకున్నారు. పుల్లారెడ్డి దంపతులకు మంత్రి నివాళులర్పించారు . కాలేజీ యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థినులు అయోధ్య రామాలయంలో ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.కళాశాల వైస్‌చైర్ పర్సన్ శ్రీవిద్యారెడ్డి మాట్లాడుతూ.. అయోధ్య రామాలయ నిర్మాణం తమ తాత జి. పుల్లారెడ్డి కల అని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా రమేష్ రెడ్డి, బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగులందరికీ ఒకేసారి వేతనాలివ్వాలి

- డిసెంబర్ నెల వేతనాలు ఇవ్వని జిల్లాలకు తక్షణమే చెల్లించాలి
- తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్(సిఐటియు) డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని అంగన్‌వాడీ ఉద్యోగులందరికీ ఒకేసారి వేతనాలివ్వాలనీ, డిసెంబర్ నెల వేతనాలు అందని జిల్లాలకు తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి, రాష్ట్ర అధ్యక్షులు కె.సునీత, కోశాధికారి పి.మంగ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణకు ఆన్‌లైన్ ద్వారా లేఖ పంపారు. 'ప్రతి నెలా 14న అందాల్సిన వేతనాలను 21న వేశారు. అదీ కొన్ని జిల్లాలకే. ఆదిలాబాద్, పెద్దపల్లి, కామారెడ్డి, యాద్రాద్రి భువనగిరి, నిజామాబాద్, మంచిర్యాల, మేడ్చల్, నిర్మల్, రంగారెడ్డి, మెదక్ తదితర జిల్లాల్లో డిసెంబర్ నెల వేతనాలు ఇంకా రాలేదు. కొన్ని జిల్లాలకు వేతనాలు వచ్చి, కొన్ని జిల్లాలకు వేతనాలు ఇంకా రాకపోవడంతో అంగన్‌వాడీ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఒకే పని చేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులకు వేతనాలిచ్చే సందర్భంలో ఈ విధంగా వ్యత్యాసం చూపించడం సమంజసం కాదు' అని కరుణ దృష్టికి లేఖ ద్వారా తీసుకెళ్లారు. ప్రతినెలా 14వ తేదీనే వేతనాలు చెల్లిస్తామని గత ప్రభుత్వం ఇచ్చిన హామీని కూడా ప్రస్తావించారు. పై అంశాలు పరిశీలించి పరిష్కరించాలనీ, అంగన్వాడీ ఉద్యోగులందరికీ ప్రతినెలా 14వ తేదీన ఒకేసారి వేతనాలు చెల్లించాలని కోరారు.

'గృహజ్యోతి'కి కసరత్తు

- వరంగల్ ఎన్పిడిసిఎల్‌లో లెక్కలు పూర్తి?
- 200 యూనిట్ల విద్యుత్‌కు రూ.1,327.56 కోట్లు ఖర్చు
- 16 జిల్లాల పరిధిలో 36,83,006 మంది వినియోగదారులు
- యూనిట్ల వారీగా లెక్కలేసిన అధికారులు
- ఇప్పటికే ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆరు గ్యారంటీల అమలులో భాగంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. గృహజ్యోతి పథకానికి సంబంధించి వరంగల్ కేంద్రంగానున్న నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఎన్‌పిడిసిఎల్)లో అధికారులు లెక్కలు సిద్ధం చేస్తున్నారు. 200 యూనిట్లకు సంబంధించి విద్యుత్ వాడుకునే వినియోగదారులకు బిల్లులు మాఫీ చేస్తే ప్రతియేటా రూ.1,327.56 కోట్లు ప్రభుత్వంపై భారం పడనున్నట్లు తెలిసింది. ఈ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌పిడిసిఎల్‌కు చెల్లించాల్సి వుంటుంది. దీని పరిధిలో 200 యూనిట్లలోపు వినియోగించుకునే వినియోగదారులు 36 లక్షల 83 వేల మంది వున్నారు. ప్రతినెలా రూ.110.63 కోట్లు ప్రభుత్వం చెల్లించాలి.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారెంటీలను అమలు చేయడానికి వేగంగా పావులు కదుపుతుంది. ఈ ఆరు గ్యారెంటీలలో 'గృహజ్యోతి' పథకంలో భాగంగా 200 యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగించే వారికి బిల్లును మాఫీ చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చింది. ఆ మేరకు వాటి అమలుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ (ఎన్‌పిడిసిఎల్) పరిధిలో 16 జిల్లాలున్నాయి. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, భూపాలపల్లి, హన్మకొండ, జగిత్యాల, జనగామ, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, మహబూబాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, వరంగల్ జిల్లాలు వున్నాయి. ఈ జిల్లాల్లో రాష్ట్ర ప్రభుత్వం 200 యూనిట్లకు దిగువన వినియోగించుకునే విద్యుత్ వినియోగదారులు 36 లక్షల 83 వేల మంది ఉన్నారు.



ఏటా రూ.1327.56 కోట్లు

ఎన్‌పిడిసిఎల్ పరిధిలోని 16 జిల్లాల్లో గృహజ్యోతి పథకం అమలు చేయడం ద్వారా ప్రతియేటా రూ.1,327.56 కోట్లు ప్రభుత్వానికి ఖర్చు అవుతుందనేది అధికారుల అంచనా. దీనికి సంబంధించి ఇప్పటికే ప్రాథమిక నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపినట్టు తెలిసింది. ఈ పథకాన్ని ఎప్పటి నుండి అమలు చేస్తారనేది తేలాల్సి ఉంది. విద్యుత్ వినియోగదారులు ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చేసే ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు. అయితే ఏడాది మొత్తంలో నెలకు 200 యూనిట్ల చొప్పున వారికి అమలు చేస్తారా? ఎన్ని యూనిట్లు వాడుకున్నా 200 యూనిట్ల వరకు అందరికీ ఇస్తారా? అన్నది ప్రభుత్వ నిర్ణయం మేరకు ఆధార పడి ఉంటుందని అధికారులు చెబుతున్నా రు. దరఖాస్తుల ఎంట్రీ పూర్తి అయిన తర్వాత మార్గదర్శకాలు విడుదల చేస్తామని ప్రభుత్వం చెప్పిన విషయం తెలిసిందే.

'గృహజ్యోతి'పై రాజకీయం

గృహజ్యోతి పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగదారులకు బిల్లులను మాఫీ చేయనుంది. ఈ విషయమై ఎన్‌పిడిసిఎల్, ఎస్‌పిడిసిఎల్ కంపెనీ అధికారులు ఒకవైపు కసరత్తు చేస్తుండగానే బీఆర్‌ఎస్, ఇతర పార్టీల నేతలు విమర్శలు చేస్తున్న విషయం తెలిసిందే. కరెంటు బిల్లులు ఎవరూ కట్టొద్దని, కరెంటు బిల్లులను సోనియాగాంధీకి పంపాలని మాజీ మంత్రి కెటిఆర్ చేసిన వ్యాఖ్యలతో కాంగ్రెస్ మంత్రులు తీవ్రంగా మండి పడ్డారు. కెటిఆర్ చెప్పినా, చెప్పకపోయినా, ఎంత రెచ్చకొట్టినా, కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చుతుందని, 200 యూనిట్ల లోపు విద్యుత్ బిల్లులను మాఫీ చేస్తుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు.

పిల్లలపై కుక్కల దాడి కలచివేసింది

- కుక్కల, కోతుల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ : మంత్రి కొండా సురేఖ
- ఆస్పత్రిలో చిన్నారికి పరామర్శ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పిల్లలపై కుక్కల దాడి ఘటన తనను కలచివేసిందని దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. వరంగల్ నగర పరిధి 21వ డివిజన్ ఎల్‌బి నగర్‌లో ఆదివారం కుక్కల దాడిలో గాయపడి గార్డియన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారిని మంత్రి పరామర్శించారు. ప్రభుత్వపరంగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ.. ఆడుకుంటున్న పిల్లలపై కుక్కలు దాడి చేశాయని, ఇదే క్రమంలో తప్పించుకునే క్రమంలో బాబు పరుగెత్తి ఇంటి గద్దెపై పడటం వల్ల తీవ్ర గాయాలయ్యాయని చెప్పారు. చేతులపై కుక్కగాట్లు ఉన్నాయని, పిల్లలకు యాంటీరెబీస్ ఇంజక్షన్‌లు ఇచ్చినట్టు చెప్పారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. బాబుకు ప్లాస్టిక్ సర్జరీ అవసరం ఉన్నట్టుగా వైద్యులు చెప్పారని, ప్రభుత్వం నుంచి ఎల్‌ఓసి అందజేసి ఆదుకుంటామని అన్నారు. బల్దియా నుంచి ప్రతి రోజూ 30 కుక్కలను పట్టుకొని శస్త్ర చికిత్సలు నిర్వహించి 2-3 రోజులు పర్యవేక్షణలో ఉంచున్నట్టు చెప్పారు. కుక్కలకు శస్త్ర చికిత్సలు చేసి సంతానోత్పత్తిని కట్టడి చేయడం జరుగుతుందన్నారు. పిల్లలను తల్లిదండ్రులు జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడూ జిడబ్ల్యుఎంసి అధికారులు అప్రమత్తం గా ఉంటూ తగు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. మంత్రి వెంట బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, సిఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, గార్డియన్ ఆస్పత్రి అధినేత డాక్టర్ కాళీ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

- రాజ్యాంగం పుస్తకాన్ని గిరిజన విద్యా సంస్థల్లో ఉంచాలి
- సమీక్షా సమావేశంలో మంత్రి సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మార్చిలో జరగబోయే పదో తరగతి పరీక్షల్లో గిరిజన గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల విద్యార్థులు వంద శాతం ఉతీర్ణత సాధించాలని పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. గిరిజన గురుకులాల ప్రిన్సిపల్స్, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వసతి గృహసంక్షేమాధికారులతో సోమవారం హైదరాబాద్‌లోని బంజారా భవన్‌లో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విద్యార్థుల పరీక్షా ఫలితాల కోసమే కాకుండా..వారి సర్వతోముఖాభివృద్ధికి ఆయా సంస్థల అధికారులు కృషి చేయాలని సూచించారు. తమ చుట్టూ ఉన్న పరిస్థితులతో పాటు జనరల్ నాలెడ్జ్‌ను అభివృద్ధి చేయాలన్నారు. వీటితో పాటు నైపుణ్య శిక్షణ, కమ్యూనికేషన్ స్కిల్స్ కూడా పాఠ్యాంశాల్లో భాగంగా ఉండాలని సూచించారు. గిరిజనుల జీవన నేపథ్యం, వారు ఎదుర్కొంటున్న సమస్యలు అర్థం కావాలంటే అధికారులందరూ క్షేత్ర స్థాయిలో పనిచేయాలన్నారు. అప్పుడే ప్రభుత్వం ఆశించిన మేరకు అభివృద్ధి జరుగుతుందన్నారు. భారత రాజ్యాంగం పుస్తకాన్ని ప్రతి గిరిజన విద్యా సంస్థలోనూ ఉంచాలనీ, విద్యార్థులకు దీనిపై పూర్తిగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. అలాగే దానిపై క్విజ్ పోటీలను నిర్వహించి విద్యార్థులు చురుకుగా పాల్గొనేలా చూడాలన్నారు. వంద శాతం ఫలితాలు సాధిస్తామని అధికారులు, ప్రిన్సిపల్స్, ప్రధానోపాధ్యాయులు, వసతి గృహ సంక్షేమ అధికారులు మంత్రి సమక్షంలో ప్రతిజ్ఞ చేశారు. అనంతరం గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలల్లో చదువుచున్న విద్యార్థులకు పౌష్టిక ఆహారంలో భాగంగా గిరిజన కార్పొరేషన్ తయారు చేసిన తేనెను ప్రతి రోజు 50 గ్రాములు ఉచితంగా ఇచ్చే పథకాన్ని మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ ముఖ్య కార్యదర్శి ఎ.శరత్, గిరిజన సంక్షేమ డైరెక్టర్ ఇవి నరసింహా రెడ్డి, గిరిజన గురుకుల సొసైటీ కార్యదర్శి నవీన్ నికోలస్, ఆడిషనల్ డైరెక్టర్ వి. సర్వేశ్వర్ రెడ్డి, చీఫ్ ఇంజనీర్ శంకర్, ట్రైకార్ జీఎం శంకర్ రావ్, జాయింట్ డైరెక్టర్‌లు కళ్యాణ్ రెడ్డి, సముజ్వల, డిప్యూటీ డైరెక్టర్‌లు, అధికారులు పాల్గొన్నారు.

'వ్యూహం'లో అభ్యంతరకర సన్నివేశాలు తొలగించాలి

- నిపుణుల కమిటీకి హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాంగోపాల్ వర్మ దర్శకత్వంలో రూపొందిన 'వ్యూహం' సినిమా సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ సస్పెన్షన్‌ను తెలంగాణ హైకోర్టు పొడిగించింది. మరో మూడు వారాల పాటు సస్పెండ్ చేస్తున్నట్లు ఉన్నత న్యాయస్థానం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. చిత్రంలో అభ్యంతరకర సన్నివేశాలను తొలగించి మరోసారి రివ్యూ చేయాలని సెన్సార్ బోర్డు నిపుణుల కమిటీని హైకోర్టు ఆదేశించింది. మూడు వారాల్లోపు చిత్రానికి సంబంధించిన కొత్త సెన్సార్ సర్టిఫికెట్ జారీ విషయంలో నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. 'వ్యూహం' సినిమాకు సిబిఎఫ్‌సీ జారీ చేసిన సర్టిఫికెట్‌ను నిలిపివేస్తూ జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను తొలగించాలని నిర్మాత దాసరి కిరణ్‌కుమార్ తరపు న్యాయవాది హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఒకవేళ ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలపై ప్రభావం ఉంటుందనుకుంటే తెలంగాణలోనైనా విడుదలకు అనుమతి ఇవ్వాలని కోరారు. దీనిపై టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తరపు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేశారు. చంద్రబాబు ప్రతిష్ఠను దెబ్బతీసేలా చిత్రీకరించిన 'వ్యూహం' సినిమా ప్రదర్శనకు సిబిఎఫ్‌సీ ధ్రువీకరణ పత్రం జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ లోకేశ్ పిటిషన్ వేసిన విషయం తెలిసిందే.

రియల్ అభివృద్ధికి చేయూత

- శివారు ప్రాంతాల్లో ఇండస్ట్రియల్, ఫార్మా క్లస్టర్లు
- మూసీకి కొత్త హంగులు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ అభివృద్ధికి తమ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (ఎన్‌ఆర్‌ఎడిసి) తెలంగాణా విభాగం ప్రతినిధి బృందం ఆయనను కలిసి రియల్ రంగం అభివృద్ధికి పలు సూచనలు, ప్రతిపాదనలను అందచేసింది. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. రాష్ట్ర ఖజానాకు పెద్ద ఎత్తున ఆదాయ మార్గాలు తెచ్చే రంగాలను తమ ప్రభుత్వం ఇబ్బంది పెట్టదనీ, వారు ఎదుర్కొంటున్న సమస్యలను తీర్చేందుకు చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. మూసీ నది పరివాహక ప్రాంత అభివృద్ధితో పాటు రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణం వల్ల హైదరాబాద్ నగరం ప్రపంచ పటంలో దూసుకుపోతున్నదని చెప్పారు. హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చడానికి శివారు ప్రాంతాల్లో పారిశ్రామిక, ఫార్మా క్లస్టర్లను ఏర్పాటు చేస్తామని వివరించారు. ధరణి పై తగు సూచనలు, సలహాలను అందచేస్తే తాను పరిశీలించడంతో పాటు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీకి అందిస్తానని వారికి తెలిపారు. డబ్బులు చెల్లించి రెండు మూడేండ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్. దరఖాస్తులను పరిష్కరించే విషయంలో ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.

సమస్యలపై వినత పత్రం

రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం ఎదుర్కొంటున్న సమస్యలు, అభివృద్ధికి పలు సూచనలను ఉప ముఖ్యమంత్రికి ఎన్‌ఆర్‌ఎడిసి సభ్యులు అందజేశారు. భవన నిర్మాణ అనుమతులకు ప్రస్తుతం ఉన్న 10 శాతం మార్టిగేజ్ విధానాన్ని ఎత్తి వేయాలనీ, రిజిస్ట్రేషన్ చార్జీలను తగ్గించాలనీ, జిఓ నెంబర్ 50ని ఎత్తివేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరిస్తే పెద్ద ఎత్తున నిర్మాణాలు ప్రారంభమై ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని పేర్కొన్నారు. టిఎస్‌బిపాస్ ద్వారా రంగారెడ్డి జిల్లాలో రెండేండ్లుగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై దృష్టి పెట్టాలని విన్నవించారు. రాష్ట్రంలో ఆరు నెలలుగా పర్యావరణ కమిటీ లేదనీ, వెంటనే ఆ కమిటీని నియమించాలని కోరారు. నిర్మాణాలకు తీసుకుంటున్న తాత్కాలిక విద్యుత్‌పై యూనిట్‌కు రూ.9 నుంచి రూ.14 పెంచారనీ, దీనిని తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఎడిసి సంఘం నాయకులు మేకా విజయ సాయి, కె. శ్రీధర్ రెడ్డి, కాశీ ప్రసాద్, దశరథ్ రెడ్డి, చలపతి రావు తదితరులు పాల్గొన్నారు.

మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరంలోని మాదాపూర్ పోలీసు స్టేషన్‌లో సోమవారం రాత్రి అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సీజ్ చేసిన సిలిండర్లు పేలడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పోలీసు స్టేషన్ సమీపంలో బాణసంచా కాల్చడంతో నిప్పురవ్వలు ఎగసిపడి సిలిండర్ల మీద పడ్డాయి. దీంతో పేలుడు సంభవించినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి వేసేందుకు తీవ్రంగా ప్రయత్నించారు.

కార్యకర్తలే కథానాయకులు

- పార్టీకి, ప్రభుత్వానికి సమన్వయం లేకపోవడం వల్లే ఈ పరిస్థితి
- ఓటమి ఊహించలేదు
- బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్‌ఎస్ పార్టీకి కార్యకర్తలే కథానాయకులని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. బిఆర్‌ఎస్ ఓటమి ఊహించలేదన్నారు. పార్టీకి, ప్రభుత్వానికి సమన్వయం లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. నల్లగొండలో ఎన్నికల ప్రచార సరళి బిఆర్‌ఎస్‌కు అనుకూలంగా ఉన్నట్టే అనిపించిందనీ, ఫలితాలు మరోలా వచ్చాయని చెప్పారు. నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ సన్నాహక సమావేశం సోమవారం తెలంగాణ భవన్‌లో జరిగింది. జనవరి 3న ఆదిలాబాద్‌తో ప్రారంభమైన సమావేశాలు నల్లగొండతో ముగిశాయి. 17 లోక్‌సభ నియోజకవర్గాల సమావేశాలు ముగిశాయి. సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ బిఆర్‌ఎస్ పార్టీకి కార్యకర్తలే కథానాయకులు అన్నారు. కార్యకర్తల వల్లే ఇన్నేళ్లుగా పార్టీ బలంగా ఉందని.. గత 16 సమావేశాల తీరు చూస్తే కార్యకర్తలే పార్టీకి ధైర్యమని చెప్పారు. ఓటమికి అనేక కారణాలు ఉన్నాయన్నారు. పార్లమెంట్ సన్నాహక సమావేశాలు ఆరంభం మాత్రమేనన్నారు. ఫిబ్రవరి మొదటి వారం నుంచి అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్షలు మొదలవుతాయన్నారు.

సోషల్ మీడియాలో జరిగిన అసత్య ప్రచారాన్ని మనం గట్టిగా తిప్పికొట్టలేకపోయామన్నారు. అవతలి వాళ్ల అభూత కల్పనలు, అబద్దాలతో ప్రజలను తప్పుదోవ పట్టించారన్నారు. మనం ఇంకా మాట్లాడటం మొదలు పెట్టనే లేదని.. కాంగ్రెస్ నేతలు ఉలిక్కిపడుతున్నారన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే ఇంకెలా ఉంటుందో ఊహించుకోండన్నారు. అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ కూడా కలగన లేదన్నారు. అందుకే ఇష్టమొచ్చినట్టు హామీలు గుప్పించారన్నారు. హామీలకు కాంగ్రెస్ పంగనామాలు పెట్టే ప్రయత్నం చేస్తోందని.. అయినా వదిలి పెట్టం స్పష్టం చేశారు.



లోక్‌సభ నియోజకవర్గ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న కెటిఆర్

ఎన్నికల్లో గెలిచేందుకు రేవంత్ రెడ్డి అడ్డమైన మాటలు చెప్పారని, కార్యకర్తలు ఉదాసీన వైఖరి, మీమాంస వీడాలన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలు ఏం మాట్లాడారు.. ఇప్పుడేం చేస్తున్నారో ప్రజలకు విడమరచి చెప్పాలని సూచించారు. కోమటిరెడ్డి గత నవంబర్‌లోనే కరెంటు బిల్లులు కట్టవద్దని చెప్పారని.. నల్లగొండ ప్రజలు బిల్లులు కట్టకుండా కోమటిరెడ్డికే పంపాలన్నారు. సాగర్ ఆయకట్టుకు కాంగ్రెస్ పాలనలో మొదటిసారి క్రాప్ హాలీడే ప్రకటించే దుస్థితి దాపురించిందన్నారు. కృష్ణా రివర్ బోర్డుకు ప్రాజెక్టులను అప్పగించి తెలంగాణ జుట్టును కాంగ్రెస్ కేంద్రం చేతిలో పెడుతోందన్నారు.

శ్రీరాంసాగర్ చివరి ఆయకట్టును కాంగ్రెస్ ప్రభుత్వం ఎండ బెడుతోందన్నారు. కరెంటు కోతలు అప్పుడే మొదలు అయ్యాయన్నారు. కాంగ్రెస్, బిజెపి అక్రమ బంధం నల్లగొండ మున్సిపాలిటీ అవిశ్వాసంలో బయట పడిందన్నారు. రేవంత్ భుజం మీద తుపాకీ పెట్టి మోదీ బిఆర్‌ఎస్‌ను కాలుస్తారట.. మైనారిటీ సోదరులకు కాంగ్రెస్, బిజెపి అక్రమ సంబంధం గురించి చెప్పాలన్నారు. రాహుల్ అదానీని దొంగ అన్నారని.. రేవంత్ దొర అంటున్నాడన్నారు. కెసిఆర్‌పై ప్రజల్లో సానుభూతి వెల్లువలా ఉందన్నారు. ఈ పరిస్థితిని పార్లమెంట్ ఎన్నికల్లో సానుకూలంగా మలచుకోవాలన్నారు. కాంగ్రెస్‌కు ఇప్పటికే అనేక వర్గాలు దూరమయ్యాయన్నారు. నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల్లో సమష్టిగా పనిచేసి గెలుద్దామన్నారు. సమావేశంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్ రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, కడియం శ్రీహరి, మాజీ స్పీకర్ మధుసూధనాచారి, నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యనేతలు పాల్గొన్నారు.